# వేల్ పిక్చర్సువారి సీతాకల్యాణము

ఆర్. ఎస్. ఆంజనేయశాస్త్రిగారు

ఇన్నాళ్ళకు, ఆంధ్రుల పెట్టుబడితో ఆంధ్ర డైరక్టర్ల యజమాయిషీక్రింద, ఆంధ్రఫిల్ములు తీయటానికి, ఆంధ్ర ఫిల్ముకంపెనీ— ఆంధ్రదేశంలో మాత్రం కాదు?— స్థాపింపబడ్డది. నిజానికి ఆ విషయం ప్రతి ఆంధ్రుడూ హర్షించ దగిందే! వారి ప్రథమ టాకీకూడా, దర్శించే భాగ్యం మనకి గల్గింది. పౌరాణికగాథలంటే, తెలుగువాళ్ళకి, ఎక్కువ ప్రీతి అనో, ఆధునిక మానవజీవితాన్ని ప్రతిబింబింప జేసే ఇతి వృత్తాల్ని రచింపించి ప్రదర్శింప చేయడం కష్టమనో, గాని, నేటి వరకు ప్రకటితమైన తెలుగు టాకీలన్నీ, పౌరాణికమే! పూర్వసాంప్రదాయం ఎందుకు పోనివ్వాలని, మన వేల్ పిక్చర్సువారుగూడా "సీతాకల్యాణం" ఫిల్ము తీశారు ప్రప్రథమంగా.

ఇహ అసలు కథలోకి వద్దాం. పాటలూ పద్యాలూ తగ్గించటం ఓ గొప్ప విశేషం—కాని, వున్న కొద్ది పద్యాలే, కళావిదులికి విసుగు పుట్టించాయి. నాటకాల్లోనూ, టాకీల్లోను, పద్యాలూ, పాటలూ అసలుండరాదనను గాని, ఉన్న పద్యాల్ని కొంతవరకు తగ్గించి, మిగిలినవాటిని బహు సొంపుగా, ముక్తసరిగా పాడితే ఎంతో బాగుంటుంది గాని వెధవబెల్లపుపాకంలాగా, ప్రతిపాదాన్నీ సాగతీస్తూ, సంగతులపై సంగతులేస్తూ, మొహం చిట్లించి, మూతి నానా అష్టావకరంగా తిప్పుతూ, రొప్పుతూ, అకారాలతో, అరగంటసేపు మంప తెంపితే నానారసాభాసగా వుంటుంది. సంగీతం వింటానికని నాటకాని కొచ్చే వాళ్ళ కేమైన రుచిస్తుందేమో గాని, నాటకం చూట్టానికని, నాటకాని కొచ్చేవాళ్లకి మాత్రం చాలా విరసంగాను, అసహ్యంగానూ వుంటుంది — ఈ విషయం మన సీతాకల్యాణంలోని నటులు విస్మరించారనాలి వొస్తుంది — లేక తెలీనే తెలియదేమో!

ఇంకో విషయం—తెల్లుగు గడ్డలోవున్న పేరొందిన నటకులంతా కాకపోయినా — ఆఖరికే కొంతమందయినా దీనిలో పాల్గొనక పోవటం డైరక్టర్లలో వుందో లేక నటుల్లోనే వుందో తెలియదు. ఒక్క వెంకటాద్రియ్యగారు, మరిద్దరు తప్పితే తక్కిన వాళ్లంతా మొన్న మొన్న నే రంగస్థలంలో కొచ్చిన రకం. బహుశః పెద్దరకం నటులంతా అధిక ద్రవ్యం అడిగుండవచ్చు కంపెనీవారు భరింపలేకపోవచ్చు. కాని, మన నటులే కొంత ఉదారస్వభావం చూపించి వుంటే బాగుండేది. అయిపోయినదానికి విచారించటం కన్న పాల్గొన్నవారు టాకీని ఎంతవరకు రసవంతంగా తీసుకొచ్చారో చూద్దాం.

మస్తుల విషయంలో, పాత్రధారణా పరికరాల్లోనూ, ఏ మాత్రం శ్రద్ధవహించినట్టు కనబడదు. ఒక్క విశ్వామిత్రుని గడ్డం తప్ప మిగిలిన ఋషులు, ఋషికుమారుల గడ్డాలు, మీసాలు, బహు అసహ్యంగా వున్నాయి. వసిష్ఠుడి గడ్డం మరీని...గోగునారకట్టే. ఉపపాత్రల విషయం అశ్రద్ధ చెయ్యటం మూలాన కూడ నాటకాన తృప్తిగా వుండక పోవటానికి, అవకాశం చాలా వుంది చూడండి! సీతకు చెలికత్తెలుగా 'అటువంటి కురూపుల్ని ప్రవేశపెట్టడం ఎంత అసందర్భంగా వుందో?

రాముడి కిరీటం చూడండి ఏవిధమైన తేజంగాని జీవం గాని వుందేమో! విగ్రహానికేం? మంచిదే! కాని ఆ కిరీటంలో వుండదగినంత రామణీయకం లేకపోయింది. కోదండం ఆఖరికి దసరా విల్లంబు మాదిరిగానైనా లేదు. ఎందుకో అంత అశ్రద్ధ ?—

ఏ రాజుకీ రాజనుస్తులులేవు. కాని సుబాహుమారీచుల మస్తులుమాత్రం బాగున్నాయి చాలావరకు. మునికుమారుల్ల మస్తులు వుండవలసిన రీతిగానే వున్నా ఆ జీబుల్లాంటి గడ్డాలు; పాడుచేశాయి పాత్రౌచిత్యాన్ని. ఆసాంతం, పాపం కైకకీ, సుమిత్రకీ అలంకమైరు తెల్ల మల్లు తాన్లేనా ?



మిస్ జుబేడా — సుప్రసిద్ధ సినిమా నటి.

అసలు కథలోకి డైరక్టుగా వస్తే, కౌసల్య, కైక, సుమిత్రలు వనంలో పువ్వులు కోస్తూండడంతో ప్రారంభించారు కథ, ముగ్గురికీ తెల్లటి చీరెలు. కురుల్లో కుసుమమ్ములలంకరించుకోటంలైనా ఏమాత్రం విలసనం కనిపించలా. ఏ మల్లెపువ్వులో చెందు గుచ్చి పెట్టుకున్నారేమో ' ఫోటోగ్రాఫీలో వుండే లోపం వల్ల, ఓ సుద్ద పిడక పెట్టుకున్నట్లు కనిపిస్తోంది.

అసలా వనమే ఓ చిట్టడవల్లేవుంది. దాంట్లో ఓ వేదిక సిమెంటుకూడా సరిగా చేయించలా. స్వల్ప లోపాలు, ఇవిగూడా ఎంచాలా? అంటారేమో ? కథ సహజంగా రసవత్తరంగా వుంటానికి యివన్ని అడ్డం వచ్చేవే!

కౌసల్య పాత్రధారిణి శ్రీహరి రూపురేఖావిలాసాల్లో మిగతావారికంటె నయం. జిల్లుమనే కంఠధ్వనిలో ప్రేక్షకుల్ని ముగ్ధులజేసే సంగీతం పాడగల్గినప్పటికి, కైకేయి అంగవిన్యాసంలో కొంచం లోటుపడ్డదనే చెప్పాలి.

ఫిలిం మొత్తంమీద భావప్రకటనకి శ్రద్ధతీసుకున్నవారు ఒక్క వెంకట్రామయ్యగారు తప్ప మరెవ్వరూ లేరు. వారి పార్టూ ఎక్కువే. పాత్రకి తగ్గవిగ్రహం. పాత్రౌచిత వేషధారణం, వేషంలోగూడా కొంచెం శ్రద్ధ తీసుకున్నట్టు కనిపిస్తుంది. ఆ నేత్రాల్లో దివ్యదృష్టి జ్యోతి అత్యద్భుతంగా ద్యోతకం చేశారు వెంకట్రామయ్యగారు. పదోచ్చారణలో కూడా, ఋషిపుంగవుల వుండాల్సిన, నిదానం, శాంతం, సంపూర్ణంగా కనపర్చారు. కాని ఒక్క విషయం— ...రాముణ్ని పంపమంటాడు: విశ్వామిత్రుడు దశరథునితో "వాడు పసివాడు, నేవస్తా..."నంటాడు దశరథుడు. అప్పుడు విశ్వామిత్రుడికి కోపం వస్తుంది, లేచి వెళ్ళబోతాడు. ఆ ఘట్టంలో నైనా, విశ్వామిత్రుడు, ఆగ్రహాన్ని తగుమాత్రం ప్రదర్శించలే. ఇంకోటి. ఒకచోట రాముని ఎదుటే విశ్వామిత్రుడు, "జై రామచంద్రప్రభుకి జై "అని గోవింద కొట్టినట్టు ప్రదర్శించారు. అదంత సమంజసంగా లేదేమో? రాముడు చిన్నవాడు "అవతారమూర్తి" అని విశ్వామిత్రుడికి తెలిసినప్పటికీ, అల్లా గోవింద కొట్టడంకంటే, ఏ శిష్యులచేతో అనిపిస్తే బాగుండేది— మొత్తంమీద వెంకట్రామయ్యగారు, విశ్వామిత్ర పాత్రను, అతి నిపుణతతో, బహురసవత్తరంగా నిర్వహించారు.

తరువాత రామపాత్ర మంచి వర్చస్సుంది మొహంలో స్ఫుటమైన కంఠం. కథాకాలానికి నిజంగా రామునికున్న బాల్యదీప్తి, "కల్యాణి" మొహంలో వుంది. దుస్తులు మాత్రం, మెరుగుపెట్టడానికి బదులు, వున్న తేజస్సునే అణిచేశాయి కొంతవరకు. పాటలూ, పద్యాలూ, పాడటంలో, పినతల్లి కైకను అనుసరించక పోతే, పాత్ర నిర్వహణం యింకా ఎక్కువ మెప్పు వడసేది. లక్ష్మణుడు గూడా అన్నకి తగిన తమ్ముడు. వేషంలోనూ, యీడులోనూ, ఫిలింలో, అతనికిచ్చిన పార్టూ అంతే. మనం చెప్పాల్సిందీ అంతే. కాని లక్ష్మణునిక్కూడా కొంత మాట్లాడడాని కవకాశం యిస్తే బాగుండేది. భరత శత్రుఘ్నుల్ని అసలే, రంగంమీదికి తేవకపోవటం ఓ పెద్ద లోపం.



కపాలకుండల — ఇందిరాదేవి.

మొత్తంమీద, ప్రేక్షకుల్ని ఆకర్షించిన రంగాలు రెండు— అహల్యా శాపవిమోచనం— శివధనుర్భంగము. అహల్య వేషం బహు సహజంగా వుంది. నాటకాల్లో పద్యంకాని, పాటగాని ఏల్లాపాడాలో, అహల్య వేషధారిణిని చూచి నేర్చుకోవాలి తక్కిన వారు. ఏ వుద్దేశ్యంతో నాటకాల్లో పద్యాలు జొప్పించారో ఆ వుద్దేశ్యాన్ని అహల్య బహుచక్కగా నెరవేర్చింది. ఆ భక్తి కరుణరసాల్ని మిక్కిలి నేర్పుతో ఒప్పించి ప్రేక్షకుల్ని ఆ కాశేపు భక్తిపారవశ్యుల్నిగా జేసిందంటే ఏమాత్రం అతిశయోక్తి లేదు. గౌతముడు పాడిన పాటకూడా తగుమాత్రమైన రాగాములు గలిగే వుంది.

శివధనుర్భంగ ఘట్టం కూడా బాగానే వుంది. కంపెనీని Patronise చేసిన, చల్లపల్లి రాజాగారి మేడ, ఆకాలంలో వుండే హర్మ్యములు మాదిరిగానే వుంది. వున్న ఏనుగుల్నీ, గుఱ్ఱాల్ని రంగంలోకి రప్పించారు. బాగానే వుంది. కాని, గుఱ్ఱం ఎక్కటం చేతకాని వాళ్ళని కూడా, స్వయంవరాని కొచ్చిన రాజులుగా జేశారు. అక్కడ కొంచెం రసాభాసగానే వుంది. రాజుగారు గుర్రం ఎక్కటం, అది కదలకపోవటం అదీని. ధనస్సు విరిచే టైములో మాత్రం గంభీరంగానే వుంది దృశ్యం.

పైన వ్రాసినవి ఆయా నటుల్నిగాని, కంపెనీవారిగాని, నిరుత్సాహపరచటానికి ఉద్దేశించినవి ఎంతమాత్రం గాదు. మనవారి లోటుబాట్లను, మనలో మనం వెల్లడిస్తే దాంట్లో తప్పేం లేదు. పైగా ముందు ముందు తయారు చెయ్యబోయే ఫిల్ములు యింకా రసవత్తరంగా వుంటానికి ఆధారభూతంగా వుంటాయి. కనుక మనవాళ్లు తయారుచేసిన ఫిల్ముల మీద, ప్రేక్షకజనుల అభిప్రాయాలు ప్రకటించటం, అవసరమని నా అభిప్రాయం.

కాని వక్క విషయం—విమర్శకులు కళాభిజ్ఞు లెవరూ యీ ఫిల్ముమీద అభిప్రాయం యింతవరకూ ప్రకటించక పోవటం విచారం. ఇకనైననూ అట్లు చేతురని నా యూహ—